మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ప్రైవేటు పాఠశాలలో నోటుబుక్కులు పట్టుకున్న ఏబీవీపి విద్యార్థులు

**పాఠశాలలో పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేసిన మండల విద్యాశాఖ అధికారి**



పాఠశాలలో ఉన్న పుస్తకాలు, యూనిఫామ్స్

**గద్వాల ప్రతినిధి జులై 3 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కాకతీయ ప్రైవేటు పాఠశాలలో అక్రమంగా నోటుబుక్కులు, స్కూలు యూనిఫామ్స్, నిల్వ ఉంచారన్న సమాచారంతో ఏబీవీపి విద్యార్థులు బుధవారం పాఠశాల తనిఖీ చేశారు. పాఠశాల తనిఖీ చేయగా ఒక రూమ్ గదిలో నిబంధనలకు విరుద్ధంగా నోట్ బుక్స్ ఉన్నాయని, గుర్తించి మండల విద్యాశాఖ అధికారికి సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకొని, కాకతీయ పాఠశాలలో ఒక గదిలో నిల్వ ఉంచిన పరిశీలించి నిబంధనలకు, విరుద్ధంగా బుక్స్ ఉన్న గదిపి సీజ్ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా నోట్ బుక్స్, యూనిఫార్మ్స్, ఇతర సామాగ్రి విద్యార్థులకు అమ్మినట్టయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏడీవీపీ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట పుస్తకాలు, యూనిఫామ్స్‌తో దర్నా చేస్తున్న ఎబివిపి విద్యార్థి సంగం నాయకులు



# 'ఫిల్టర్' మాఫియా..

**ఇసుక కరువైనా మట్టితో ఫిల్టర్లతో తమ దందాను దర్జాగా కొనసాగిస్తున్నారు ఇసుకాసురులు. వాగులు, వంకలు,కాలువల పరివాహక ప్రాంతాల్లో ఇసుకను లేకుండా చేసి దర్జాగా అమ్ముకొని లక్షలు గడించారు. ఇసుక లేకపోవడంతో ఇప్పడంతా మట్టి ఫిల్టర్లతో తమ దందాకు మళ్లీ తెరలేపారు. ఫిల్టర్ ఇసుకను సైతం ఒక ట్రాక్టర్ రూ4వేల వరకు, బెంజ్‌లారీ అయితే రూ.40వేలకు పైగా విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారు. ఇదంతా అధికారుల కనుసన్నల్లో జరుగుతున్నా తమకేమీ తెలియనట్లు మిన్నకుండిపోవడం గమనార్హం.**

*- భూత్పూర్, జూలై 3, ప్రభాతవార్త*

- **వాగులు,కాలువల పరివాహక ప్రాంతాలలో కరవైన ఇసుక**
- **మట్టి ఫిల్టర్లతో లక్షలు గడిస్తున్న ఇసుకాసురులు**
- **కుటీర పరిశ్రమగా ఇసుక ఫిల్టర్ వ్యాపారం..**
- **ట్రాక్టర్‌కు రూ.5వేలు, బెంజిలారీలు అయితే రూ.40వేలు**
- **అధికారుల కనుసన్నలలోనే దందా..?**

భూత్పూర్ మండలంలో ఇసుక దందా మూడు పూవులు ఆరుకాయలుగా సాగు తోంది.పట్టించుకునే నాథుడేలేక వీరి వ్యాపారానికి అడ్డుకట్టే లేకుండా పోతోంది.నాటి రోజుల్లో ఇసుకను వాగులు,వంకలు, కాల్వల పరివాహక ప్రాంతాల నుంచి తేటతెల్లమైన స్వచ్ఛమైన ఇసుకను తెచ్చి స్వల్పపాటి లాభాలతో ఇసుకను గృహ నిర్మాణాల అవసరాలకు వాడేవారు.కానీ నేడు కొందరు ఇసుకాసురులు ఇసుకకు బదులుగా మట్టిని గుట్టలు గుట్టలుగా తెచ్చి ఫిల్టర్ చేస్తూ ఇసుకగా మార్చి టిప్పర్లు,బెంజిలారీలు,ట్రాక్టర్లలో ట్రిప్పులు,ట్రిప్పులుగా తరలిస్తు కోట్లు గడిస్తున్నారనే విమర్శలు బాహాటంగా వినవస్తున్నాయి.పంటపొలాల వద్ద కాల్వల పక్కన నది పరివాహక ప్రాంతాల వద్ద ఇసుక అక్రమార్కులు ఇసుకకు బదులు మట్టిని గుట్టలు గుట్టలుగా ప్రోగుచేసి కాల్వల పక్కన ఫిల్టర్ చేస్తూ రాత్రికి రాత్రే మట్టి ఇసుకను టిప్పర్లు,బెంజిలారీలలో అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటారన్న ఆరోపణలు లేకపోలేవు.ట్రాక్టరైతే రు.5వేలు,టిప్పరైతే రు.పాతికవేలు,బెంజిలారీ అయితే రు,30నుంచి రు.40వేల వరకు ఇసుక అక్రమార్కులు గృహ వినియోగదారుల వద్ద నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.భూత్పూర్ పట్టణ,రూరల్ ప్రాంతాలల్లోని కొన్ని గ్రామాల్లో ఇసుక దందా కుటీర పరిశ్రమగా మారిందనే ఆరోపణలున్నాయి.భూత్పూర్ పట్టణ మున్సిపల్ పరిధి లోని ఒకటి,రెండు,మూడో,ఐదు,ఆరో వార్డులు,తండాలలో ఇసుక దందా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది.ఇక మండ ల పరిధిలోని కొన్ని గ్రామాలు ముఖ్యంగా కప్పెట,కరివెన,మద్దిగట్ల,రావులపల్లి,భట్టుపల్లి,అన్నాసాగర్,మొల్గర,వెల్కిచర్ల గ్రామాలలో ఇసుక వ్యాపారం మూడు పూవులు,ఆరుకాయలుగా సాగుతోందని తెలుస్తోంది.అధికారులకు కూతవేటు దూరంలో ఈ ఇసుక అక్రమరవాణా బాహాటంగా జరుగుతున్నా అధికారులకు చీమకుట్టినట్లయినా లేదని స్థానికులు ఆరోపిస్తునారు.ఇసుకాసురులు వాగులు,గుట్టలు,వంకలు,కాల్వల్ని తోడేళ్లలా తోడేసి ఎడారిగా మారుస్తూ చివరకు ప్రకృతి స్వభావసిద్ధంగా ఉంటోన్న గుట్టల్ని సైతం పిండి చేస్తూ అక్రమార్జనలకు పాల్పడుతున్నారు.

మట్టిదిబ్బలు,గుట్టల్ని పిండి చేస్తూ నేలమట్టం చేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతుంటే సంబంధిత పోలీస్,రెవెన్యూ, భూగర్భజలవనరుల శాఖలు ప్రేక్షక పాత్రను పోషిస్తున్నాయనే ఆరోపణలు సామాన్యులు,ప్రజల నుంచి బాహాటంగా వినవస్తున్నాయి.ఏదేమైనా మట్టిని ఇసుకగా మార్చి రు.లక్షలు,కోట్లు గడిస్తున్న ఇసుక ఆక్రమార్కులపై అధికారులు కొరఢా ఝుళిపించాల్సిన అవసరమెంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.రోజు రోజుకు ఇసుక ఫిల్టర్ల దందా కళ్ల ముందే ఇంత తంతూ జరుగుతున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తిన చందంగా మారుతున్నారని స్థానికులు పలువురు పెదవి విరుస్తున్నారు.ఇకనైనా సంబంధిత అధికారులు మట్టి ఫిల్టర్లపై దేగకన్నేసి వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు,ప్రజలు కోరుతున్నారు.





డంప్ చేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న ఇసుక రీచ్‌లు

## 100కాదు..
# 30 పడకలే..!



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

- **గత ప్రభుత్వం నిర్వాకం వల్లే మౌలిక వసతులు లేవు**
- **ఇప్పుడు బాధ్యత నాది.. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్,వైద్యులను నియమిస్తాం**
- **విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రానీయ్యం**
- **వచ్చే వారం సీఎం పర్యటనలో తెలియజేస్తాం**
- **జడ్చర్ల దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 3, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం హడావుడిగా 100పడకల దవాఖాన అని ప్రారంభించి మౌలిక వసతులు కల్పించలేదని, వైద్యులు లేరని, అందువల్లే ఇప్పుడు రోగులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల దవాఖానను విద్యుత్ ఎస్ఈ వెంకటరమేశ్, జడ్చర్ల డీఈ కృష్ణమూర్తితో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. దవాఖానలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడ్డారని, వైద్యులు సైతం సెల్‌ఫోన్ వెలుగులో వైద్యం చేశారని సోషల్ మీడియాలో వార్తలు రావడంతో ఎమ్మెల్యే బుధవారం దవాఖానను సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆర్ఎంవోతో వివరాలు ఆరా తీశారు. విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోయిందో తెలుసుకున్నారు. దవాఖానల కట్టిన స్థలం సరైందని కాదని, రోడ్డు వసతి కూడా సరిగా - మిగతా4లో..

## ఏసీబీవలలో తహసీల్దార్..

**వనపర్తి ప్రతినిధి జులై 03 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం జింకల బీడు తాండాకు చెందిన మూడవ పాండు అనే వ్యక్తి దగ్గర బుధవారం సాయం త్రం 8 రూపాయలు లంచం తీసుకుంటూ తహసిల్దార్ ఎస్. శ్రీనివాసులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు... మూడవ పాండు తన భార్య పేరున ఉన్న వ్యవసాయ పొలాన్ని నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా తాసిల్దార్ 8వేల రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించ డం తో బుధవారం తహసిల్దార్ కార్యాలయంలో నేరుగా తహసిల్దార్‌కు బాధితుడు లంచం ఇస్తుండగా ముందస్తుగా పథకం ప్రకారం వలపనిన అధికారులు తహసిల్దార్ శ్రీనివాసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు.



ఏసీబీ కి పట్టుబడ్డ తహసిల్దార్ శ్రీనివాసులు

## మహిళల సంక్షేమమే ధ్యేయం..

**58 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**



కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై 03 ప్రభాతవార్త :** మహిళల సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హన్వాడ మండలంలోని,14గ్రామాలకు చెందిన 58మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందించి ఆయన మాట్లాడారు. మహిళల సంక్షేమానికి ఈ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అందులో భాగంగానే మహిళా సంఘాలకు పాఠశాలల నిర్వహణ మొదలు పాఠశాల భవనాల నిర్మాణాలను కూడా అప్పగిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి పెళ్లి అయిన నెలలోపే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని, ఎలాంటి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి వద్దు అని ఆయన హెచ్చరించారు. ఆడకూతురు పెళ్లి చేసిన ఏ తల్లిదండ్రులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్రం ఎంత ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన చేసి, లబ్దిదారులందరికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందించడం జరిగిందని,ఈ రోజు చెక్కులు తీసుకున్న అందరి పెదాలపై చిరునవ్వు కనిపిస్తుందని ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎక్కడా కమీషన్ల సంస్కృతి లేదని, ఏ సంక్షేమ పథకానికి చిల్లిగవ్వ ఏఅధికారికి, ఏ నాయకుడికి ఇవ్వాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు.అధికారి చేపట్టిన తొలిరోజే మేము - మిగతా4లో..

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**రోగులతో మాట్లాడి, అన్ని వార్డుల పరిశీలన**

**మహబూబ్‌నగర్‌బ్యూరో,జులై03 ప్రభాతవార్త:** జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఐసియు పురుషుల, స్త్రీల శస్త్రచికిత్స వార్డు, ఇంజెక్షన్ వార్డు, దంత విభాగం, అల్ట్రాసౌండ్ స్కానింగ్ రూం, సెంట్రల్ లేబరేటరీ, డి ఆడిక్షన్ సెంటర్, గైనకాలజీ విభాగం వార్డులను కలియ తిరిగి పరిశీలించారు. ఆసుపత్రి డాక్టర్లు, రోగులతో మాట్లాడారు. ఆసుపత్రిలో విధులు నిర్వర్తించే డాక్టర్లు, వైద్య సిబ్బంది హాజరు, మానిటరింగ్ ఎలా చేస్తున్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ విధానం ద్వారా డాక్టర్లు, ఆసుపత్రి వైద్య సిబ్బంది హాజరు నమోదు చేస్తున్నట్లు కలెక్టర్‌కు ఆయన వివరించారు. డి ఆడిక్షన్ సెంటర్‌లో సైకియాట్రి విభాగంలో డాక్టర్లు, సిబ్బంది గురించి, ఇక్కడ ఎటువంటి కేసులు వస్తాయి తెలుసుకున్నారు. గైనకాలజీ విభాగంలో రోజు ఎంతమంది వస్తున్నారు. ఎటువంటి కేసులు వస్తున్నాయి హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. నేరుగా వచ్చే రోగులతో పాటు, పిహెచ్‌సి, సిహెచ్ నుండి రిఫర్ చేసిన కేసులు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 450 బెడ్‌లు ఉండగా రోగుల సంఖ్య పెరిగినందున పారిశుద్ధ్య, సెక్యూరిటీ సిబ్బంది సంఖ్య పెంచాలని కలెక్టర్‌ను కోరారు. ఎస్ఎన్‌సియు విభాగంలో డెలివరీ తర్వాత శ్వాస సమస్య, తక్కువ బరువు, నెలలు ముందు జన్మించిన శిశువులకు చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. జీవన్, గైనకాలజిస్టు, డా. రాధ, ఆర్ఎంఓలు డా. దుర్గ, డా. శిరీష, డా. భాస్కర్‌నాయక్, సిహెచ్ఓ రాముడునాయక్, ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు సాదత్ అలీ ఉన్నారు.



దవాఖానాలో పరిశీలిస్తు రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

## గ్రామాల అభివృద్ధి
# విద్యతోనే సాధ్యం..



తరగతి గదులను ప్రారంభించిన ఎమ్మెల్యే, జడ్పీటిసి శామల

**గద్వాల ప్రతినిధి జులై 3 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గట్టు మండలం పరిధిలోని వాయిలకుంట తండా, తారాపురం, ముచ్చోనిపల్లి గ్రామాలలో మండల పరిషత్‌లో ఎంపీపీ నిధుల నుండి 36 లక్షలతో నిర్మాణం చేసిన అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకి ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. 36 లక్షలతో ఎంపీపీలో నిధులతో నిర్మాణమైన పాఠశాలలోని అదనపు తరగతిగదులను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించి తరగతి గదులను పరిశీలించారు. అనంతరం గట్టు మండల పరిధిలోని తప్పెట్ల మొర్సు గ్రామంలో పాఠశాల కాంపౌండ్ వాల్, ఆధునిక భవనం 22 లక్షలతో నిర్మాణం చేసిన భవనాన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. పాఠశాలలోని టాయిలెట్స్ నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం తప్పెట్ల మొర్సు గ్రామంలో పాఠశాల ఆవరణలో - మిగతా4లో..

## నిద్రావస్థలో నీటిపారుదల శాఖాధికారులు

**అధికారులు ఆడిందే ఆట పాడిందే పాట**

**ఉన్నతాధికారుల కొరవడిన పర్యవేక్షణ**

**అధికారుల నిర్లక్ష్యంతో నష్ట పోతున్న రైతులు**

**గద్వాల ప్రతినిధి,జులై 3 ప్రభాతవార్త :** ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నడిగడ్డ రైతులకు నీటి పారుదల విషయంలో పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని విధులకు రైతు పారుదల విషయంలో పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని రైతు సంగం ప్రతినిధులు , రైతులు అంటున్నారు .అధికారులు సక్రమంగా విధులకు రావడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం మూలంగా డివిజన్ ,సబ్డివిజన్ స్థాయిలో పనిచేసే ఈఈ, డిఈ, ఎఈ మిగితా స్థాయి అధికారులు తరుచగా విధులకు డమ్మాలు కొడుతున్నారనే ఆరోపణల ఉన్నాయి .జోగులాంబ గద్వాల జిల్లాలో జూరాల, నెట్టెంపాడు ,ఆర్డిఎస్ ,తుమ్మిళ్ల ప్రాజెక్ట్ పరిధిలో వందలాది మంది ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహించకుండానే లక్షల్లో వేతనాలు పందుతున్నారనే ఆరోపణల ప్రాజెక్ట్ పరిధిలో అనేక పనులు అసంపూర్తిగా ఉన్నాయి .గుర్రం గడ్డ బ్రిడ్జి గద్వాల జిల్లా కేంద్రంలో కుడి కాలువ పై నిర్మిస్తున్న గడ్డ బ్రిడ్జ ,పనులు సుమారు 10 సంవత్సరాలనుండి పూర్తి కావడం లేదని ప్రజలు రైతులు అంటున్నారు .జూరాల జలాశయంలో గత కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతంమైన కర్ణాటక ప్రాజెక్టల నుంచి వస్తున్న ప్రవాహం కారణంగా నీటి నిల్వ గణనీయగా పెరుగుతుంది. మెన్నటి వరకు ఎత్తి పోతల పథకాలకు సైతం నీటి తరలింపు కొనసాగించారు జూరాల కుడి కాల్వకు మాత్రం నీటి విడుదల మొదలు కావటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు దీనిపై రైతులు ,రైతు సంఘాల ప్రతినిధులు ఆందోళర వ్యక్తం చేస్తున్నారు జులై మొదటి వారం వచ్చినా నారుమడులు పోసుకో పటినికి నీటి విడుదల చేయక పోతె ఖరీప్ సాగు అలస్యం అయి దాని ప్రభావం రబీపై - మిగతా4లో..



పూడిక తీస్తున్న దృశ్యం

## డ్రోన్ పైలెట్లకు సహకారం
# అందేలా కృషి చేస్తాం..

**శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్‌ల పంపిణీ మంత్రి**



శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి జూపల్లి

**కొల్లాపూర్,జులై 03 ప్రభాతవార్త:** కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఎంపిక చేసిన 20మంది యువ మహిళలకు రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార యుఎవి వారి సహకారంతో - మిగతా4లో..

## వెల్టూరు మండల కేంద్రంగా ప్రకటించాలని వినతి



**ఉప్పునుంతల, జులై 03 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు గ్రామాన్ని మండలంగా ప్రకటించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను పిరట్వాన్ పల్లి ఎంపిటిసి బూరం మల్లేష్ ఆధ్వర్యంలో వినతి పత్రం చేశారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ఆదేశాల మేరకు మంత్రి సీతక్కను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ గ్రామాల నుంచి మండల కేంద్రమైన ఉప్ప నుంతలకు రావడానికి ఎంతో ఇబ్బంది ఏర్పడుతుందని, దాదాపు 25 కి.మీలు రావాల్సి వస్తుందని, వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటిస్తే 15 గ్రామాలకు మెరుగవుతుందని, తూర్పు గ్రామాల ప్రజలు మంత్రికి ఏకరువు పెట్టుకున్నారు. స్పందించిన మంత్రి సీతక్క పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వినతి పత్రం అందజేసిన వారిలో జడ్పీటిసి అనంత ప్రతాపరెడ్డి, ఎంపిపి అరుణ నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్టానంతరెడ్డి, గుద్దటి బాలరాజ్, వెంకటేష్, జగన్, రాజు తదితరులు ఉన్నారు.

## శ్రీ తిమ్మప్ప స్వామిని దర్శించుకున్న ఎంపీపీ, జడ్పిటిసిలు



**మల్దకల్ జులై 3 ప్రభాతవార్త:** నేటితో పదవీకాలం ముగియనున్న సందర్భంగా మల్దకల్ మండల జడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, ఎంపీపీ రాజారెడ్డి, వైస్ ఎంపీపీ వీరన్న, ఎంపీటీసీలు గోపాల్ రెడ్డి తదితరులు బుధవారం శ్రీ స్వయంభు లక్ష్మి వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పట్వారి ఆరవేంద్రరావు అర్చకులు దేవాలయంలో స్వాగతం పలికి అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్రపటం, శేష వస్త్రంతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్ రావు, చక్రధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మకూరు అభివృద్ధికి చేయూతనివ్వండి

## జిల్లా కలెక్టర్‌కు మున్సిపల్ చైర్మన్ విజ్ఞప్తి



**ఆత్మకూర్ జులై 03 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలోని ఆత్మకూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అన్ని విధాల ఆదుకోవాలని ఆత్మకూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గాయత్రీ రవికుమార్ యాదవ్ వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి తదితరులు బుధవారం రోజు కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ సురభిని ఆత్మకూరు అభివృద్ధి కోసం తమ వంతు సహాయ సహకారాలు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా ఆత్మకూర్ ప్రధాన రహదారిపై రోడ్డు వెడల్పు పనులకు గాను ప్రత్యేక నిధులు పట్టణంలోని ఆయా కాలనీలలో అంతర్గత రహదారుల నిర్మాణాలకు మురుగు కాలువల నిర్మాణాలకు ప్రత్యేక నిధులు కేటాయించి ఆత్మకూరు అభివృద్ధికి చేయూతనివ్వాల్సిందిగా ఆత్మకూరు మున్సిపాలిటీ పాలకవర్గం కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసింది.

### నేడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే

## విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

**ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల పిలుపు**



**కొత్తకోట జులై 03 ప్రభాతవార్త :** ఈ నెల 4న జరిగే రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు మొగలి పిలుపునిచ్చారు. బుధవారం కొత్తకోట పట్టణ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఐటీఐ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, విద్యార్థి సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...అసమర్ధ ఎన్‌టిఏను రద్దు చేయాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసి, ఇటీవల నెట్,నీట్ పరీక్షలు రాసి, నష్టపోయిన విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిహెచ్‌డి అడ్మిషన్ల కోసం ఇటీవల ఆమోదించిన తప్పనిసరి నెట్ స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, ఐఐటీ ముంబై నుండి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోనూ స్వేచ్ఛ, వ్యక్తీకరణ ప్రజాస్వామ్య అణిచివేత చర్యలను ఆపాలని, పాఠశాలల మూసివేతను ఆపాలని కోరారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలని డిమండ్ చేస్తూ జులై 4న రాష్ట్ర వ్యాప్తంగా జరిగే విద్యాసంస్థల బందును జయప్రదం చేయాలని, విద్యాసంస్థల యాజమాన్యాలు స్వచ్ఛందంగా బందుకు సహకరించాలని ఈ బందులో విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ కొత్తకోట మండల కమిటీ సభ్యులు, రాజవర్ధన్, సాయి, కుమారస్వామి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ్‌కు కన్నీటి వీడ్కోలు..

**కన్నీటి సంద్రమైన పాలెం గ్రామం.. అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ**

**బిజినేపల్లి, జులై 03 ప్రభాతవార్త :** పాలెం వ్యవసాయ కళాశాల ముందు బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందిన విద్యార్థి సిద్ధార్థ్ (18)కు గురువారం కన్నీటి వీడ్కోలు పలికారు. పాలెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోవా శేఖర్ పెద్ద కుమారుడు సిద్ధార్థ్ చెన్నైలో ఐఐటి మొదటి సంవత్సరం పూర్తిచేసి ఇటీవలే సెలవుల్లో గ్రామానికి వచ్చాడు. బుధవారం మిత్రుని కలిసి సొంత బైక్‌పై వెళుతుండగా వ్యవసాయ కళాశాల ముందు కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 అంబులెన్స్‌లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా తలకు బలమైన గాయం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్‌రెడ్డి ఆసుపత్రిలో పరామర్శించి ధైర్యం చెప్పారు. సిద్ధార్థ్ గ్రామంలో అందరితో కలివిడిగా ఉండేవాడని విద్యార్థి మృతితో కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమ యాత్రలో ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్‌రెడ్డి, ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ మలిశెట్టి వెంకటస్వామి, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు. చేతికి అంది వచ్చిన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రుల గుండె పగిలేలా ఏడుపు పలువురిని కంటతడి పెట్టించింది. సిద్ధార్థకు తమ్ముడు, చెల్లి ఉన్నారు.

## సీసీ కెమెరాల నిఘాలో మక్తల్ పట్టణం

**మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి**



**మక్తల్, జులై 03 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణం మొత్తంగా సీసీ కెమెరాల నిఘాలో ఉన్నదని, పట్టణంలో 46 సిసి కెమెరాల సహాయంతో నిఘాను ఏర్పాటు చేయడం జరిగిందని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. మక్తల్‌లో దొంగతనాల నివారణ గురించి ముందస్తు భద్రత చర్యల్లో భాగంగా సిసి కెమెరాలు పటిష్టంగా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్సై తెలిపారు. వివిధ రకాల షాపుల యజమానులు కాలనీలలో గ్రామాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగతనాలను నివారించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఎవరైనా దొంగతనాలు చేయడానికి భయపడతారని అలాగే ఆకతాయిల నుండి అసాంఘిక కార్యక్రమాలు నిర్మూలించడానికి అవకాశం ఉంటుందని ఎస్సై తెలిపారు. మక్తల్‌లో కొన్ని సిసి కెమెరాలు పని చేయకపోవడంతో బుధవారం సిసి కెమెరాలు మరమ్మతులు, సర్వీసింగ్ నిర్వహించడం జరిగిందని, కొన్ని నూతన సిసి కెమెరాలతో పాటు ప్రస్తుతం మక్తల్ టౌన్‌లో మొత్తం 46 సిసి కెమెరాలు పని చేస్తున్నాయని తెలిపారు. ప్రజలు తప్పకుండా సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై కోరారు.

# పార్టీలకతీతంగా పనిచేసేవాడే నిజమైన నాయకుడు..!!

- ఎంపిపిని సన్మానించిన దేవరకద్ర ఎమ్మెల్యే
- శేష జీవితం ప్రజాసేవకే అంకితమన్న ఎంపిపి కదిరే..
- భూత్పూర్‌లో ఎంపిపి,ఎంపిటీసీల పదవీ విరమణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్..
- ఎంపిటీసీ,మీడియా ప్రతినిధులను సన్మానించిన ఎంపిపి,ఎమ్మెల్యే..



ఎంపిపి పదవీ విరమణ,సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్



పదవీ విరమణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి

**భూత్పూర్, జులై 3,ప్రభాతవార్త :** పార్టీలకతీతంగా పనిచేసేవాడే నిజమైన ప్రజాసేవకుడు,అతడే నిజమైన నాయకుడని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) స్పష్టం చేశారు.ఎంపిపి, ఎంపిటీసీల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో బుధవారం భూత్పూర్ పట్టణ కేంద్రంలోని కేవీఎన్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటైన భూత్పూర్ ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి ఇతర ఎంపిటీసీల పదవీ విరమణ మహోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి(జీఎంఆర్) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పదవీ విరమణ పొందుతున్న ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డిని శాలువలు,పూలమాలలతో ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ ఐదేళ్లు వైఎస్ ఎంపిపి,మరో ఐదేళ్లు ఎంపిపిగా పని చేసిన కదిరే శేఖర్‌రెడ్డి భూత్పూర్ మండల ప్రజల ఆదరణ,ప్రజాభిమానాన్ని చూరగొన్నారని,అతని నిస్వార్థసేవతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడప గలిగారని పేర్కొన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపి,రాష్ట్రాన్ని దివాళా తీయించి పబ్బం గడిపి ఖాళీ కుండను కాంగ్రెస్ చేతిలో పెట్టిందని విమర్శించారు. కమిషన్లకు కక్కుర్తిపడి ప్రాజెక్టులలో కోట్లు దండుకున్నారని పేర్కొన్నారు.కాంగ్రెస్ హయాంలో మంజూరైన ప్రాజెక్టులకు బీఆర్ఎస్ పునఃప్రారంభం చేసి కోట్లాది ప్రజాధనాన్ని దుర్వినియోగ పరిచారని,మూడేళ్లలో పూర్తి చేస్తామని శుష్కవాగ్దానాలు చేసి పూర్తి చేయలేదని విమర్శించారు.మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు ఉడతాభక్తిగా ఎకరాకు రు. ఐదు వేలు,పది వేలు ఇస్తే అవి రైతు వడ్డీకే సరిపోలేవని పేర్కొన్నారు.రైతు బిడ్డగా సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రు.2లక్షల రుణమాఫీకి శ్రీకారం చుట్టారని అన్నారు.రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలన అందిస్తోందని చెప్పారు.ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,రు.ఐదొందలకే గ్యాస్ సిలెండర్,రెండు వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు వంటి బృహత్తర సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్ని అందిస్తూ అందరి మన్నల్ని చూరగొంటున్నారని పేర్కొన్నారు. అనంతరం ఎంపిపితో పాటు ఎంపిటీసీలు,మండల మీడియా ప్రతినిధులను శాలువలు,పూలమాలలతో సన్మానించారు.

**శేష జీవితం ప్రజాసేవకే అంకితం**

**-పదవీ విరమణ చేసిన ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి**

తాను గడిచిన పదేళ్ల కాలం పాటు రాజకీయంలో ఉన్నానని,ఐదేళ్ల పాటు వైఎస్ ఎంపిపి,మరో ఐదేళ్ల పాటు ఎంపిపిగా ప్రజా సేవలో పాలు పంచుకోగలిగానని,తన శేష జీవితం ప్రజాసేవకే అంకితం చేయాలనుకున్నానని పదవీ విరమణ పొందిన ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డి అన్నారు.తన రాజకీయంలో వైఎస్ ఎంపిపిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అవకాశం కల్పించారని,తన సొంత ఖర్చుతో కాల్వలుతవ్వించి రైతులకు తన వంతు సహాయం అందించానని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే జీఎంఆర్ నేతృత్వంలో నియోజక వర్గం అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎమ్మెల్యే అవిరళ కృషిచేస్తున్నారని,ఎమ్మెల్యే సారథ్యంలో పని చేసేందుకు తాను ఇటీవల కాంగ్రెస్‌లో చేరానని కదిరే శేఖర్‌రెడ్డి స్పష్టంచేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కదిరే అశోక్‌రెడ్డి,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్‌తో పాటు టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవిందకుమార్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు నాగిరెడ్డి,గోవర్ధన్‌గౌడ్, సంజీవరెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి,అన్వర్‌పాష,మంగలి వెంకటనారాయణ, పలువురు ఎంపిటీసీలు,ఎంపిడీఓ ప్రభాకర్‌చారి,తహసిల్దార్ రాజు,మండల వ్యవసాయాధికారి మురళీధర్,మధుసూధన్ ఇతర మండల అధికారులు పాల్గొన్నారు.అనంతరం తహసిల్దార్ రాజు మండలానికి మంజూరైన 36మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే జీఎంఆర్,ఎంపిపి కదిరే శేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



భూత్పూర్ మండల మీడియా ప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్,ఎంపిపి కదిరే



36మందికి కల్యాణలక్ష్మి చెక్కుల్ని అందజేస్తున్న ఎమ్మెల్యే,ఎంపిపి,ఎమ్మార్వో

# ముగిసిన ఎంపిటిసిల పదవీకాలం..

**గ్రామాల అభివృద్ధికి అరకొరగా అందిన నిధులు.. 6నెలల పాటు అందాల్సిన గౌరవ వేతనం..**

**ఇటిక్యాల జులై 3 ప్రభాతవార్త :** మండల పరిధిలోని ఎంపీటీసీల పదవీకాలం జులై 3 బుధవారంతో ముగియగా జోగులాంబ గద్వాల జిల్లాలో 12 మండలాలు ఉండగా మొత్తం 141 మంది ఎంపీటీసీ వారి 5 సంవత్సరాలు పదవి కాలం బుధవారం ముగిసింది. ఎంపీటీసీల నుండి ఎంపీపీగా ఎన్నుకొన్న పదవి కాలం పూర్తి కావడంతో స్థానంలో ప్రత్యేక అధికారులను నియమించే ఏర్పాట్లను ప్రభుత్వం ఆలోచింస్తుంది. మండల పరిధిలోని ఎంపీటీసీల స్థానంలో రిజర్వేషన్ల వారీగా 2019 మే,జున్ నెల మధ్యలో జరిగిన ఎన్నికల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి గెలవగా గ్రామపంచాయతీలో ప్రత్యేక విధులు నిధులు లేక నామమాత్రంగానే ఎంపిటిసిలుగా ఎన్నికై 5 సంవత్సరాల పాటు ప్రజాప్రతినిధిగా ఉండి బుధవారంతో ఎంపిటిసిల పదవి కాలం పూర్తయింది. అప్పట్లో జరిగిన ఎంపిటిసిల ఎన్నికల్లో మెజార్టీ ఎంపిటిసిలు అప్పటి టిఆర్ఎస్ పార్టీ నుండి ఎన్నికై న పూర్తిస్థాయిలో నిధులు విడుదల లేకపోవడంతో ఆశించిన విధంగా గ్రామాలలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేక పోయారు. అంతేకాక ఆశించిన మేర మండల పరిషత్ నిధులు గాని. జిల్లా పరిషత్ నిధులుగాని. నియోజకవర్గ ఎమ్మెల్యే ఎంపీల ద్వారా నిధులు తెచ్చుకోలేక ఎంపిటిసిలు పదవి కాలం పూర్తి చేసుకున్నారు. కేవలం ప్రతి సంవత్సరం వేసవి కాలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొంతమేర సిసిరోడ్లు నిర్మాణం నియోజకవర్గ ఎమ్మెల్యే ద్వారా పనులు తెచ్చుకొని నిర్మాణం చేపట్టారు. అలాగే కొంతమేర సీడీపీ నిధుల కింద పనులు చేపట్టగా మండల పరిషత్ 15 వ ఆర్థిక సంఘం నిధుల కింత గ్రామాలలో పాఠశాల గదుల నిర్మాణం. డ్రైనేజీల నిర్మాణం. తాగునీటి అవసరాలు వంటి పనులు ఎంపిటిసిలు గ్రామాలలో చేపట్టారు. 5 సంవత్సరాల పదవి కాలానికి ఒక్కో ఎంపిటిసి కి 8 లక్షల రూపాయల నిధుల దాకా పనులు చేపట్టినట్లు సమాచారం. మండలంలో 2019 మే జున్ నెలలో మధ్య జరిగిన ఎంపిటిసి లో ఎన్నికల్లో 15 ఎంపిటిసి స్థానాలకు టిఆర్ఎస్ పార్టీ నుండి 12 మంది ఎంపీటీసీలు. ముగ్గురు ఇండిపెండెంట్ ఎంపీటీసీలు. ఒకరు కాంగ్రెస్ ఎంపిటిసిలుగా గెలుపొందారు. ముగ్గురు ఇండిపెండెంట్ ఎంపీటీసీలు వెంటనే అధికార టిఆర్ఎస్ పార్టీ లో చేరిపోయారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపిటిసిలుగా ఎన్నికైన గత ప్రభుత్వాల కంటే ఎక్కువగా గౌరవ వేతనం కేసిఆర్ ప్రభుత్వంలో తీసుకున్నారు. నెలకు ప్రతి ఎంపీటీసీ కి 5 వేల రూపాయల గౌరవ వేతనం గత ప్రభుత్వం అందించింది. బుధవారంతో ఎంపిటిసిల పదవి కాలం పూర్తి కాగా వారికి ఇంకా 6 నెలల గౌరవ వేతనం ప్రభుత్వం నుంచి అందాల్సి ఉంది.

# ప్రతి కార్యకర్తకు అండగా బిఆర్ఎస్ పార్టీ

**ప్రమాదవశాత్తు చనిపోయిన పార్టీ కార్యకర్తల కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ 2 లక్షలు బీమా చెక్కులను అందజేసిన ప్రజా ప్రతినిధులు**



రెండు లక్షల చెక్కును అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**గద్వాల ప్రతినిధి జులై 3 ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం గద్వాల మండల పరిధిలోని ఈడుగోని పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త గువ్వల రాముడు, రోడ్డు ప్రమాదంలో మరణించారు. కాబట్టి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వంలో భాగంగా ప్రమాదవశాత్తు చనిపోయిన వారి కుటుంబానికి 2 లక్షల ప్రమాద బీమా కింద 2,00,000 లక్షల రూపాయలు చెక్కును బిఆర్ఎస్ పార్టీ తరపున రెండు లక్షల రూపాయలు మంజూరు కావడం అయిందని తెలిపారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, ఎంపీపీ ప్రతాప్ గౌడ్, జడ్పి వైస్ చైర్మన్ భర్త రమేశ్ నాయుడు నేరుగా ఈడిగోని పల్లి గ్రామానికి వెళ్లి బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు గువ్వల రాముడు స్వగృహం నందు భార్య నామిని, సుజాత కు రెండు లక్షల రూపాయలు చెక్కును అందజేయడం జరిగింది. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ బిఆరర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ పేద ప్రజలకు అండగా నిలిచారు అన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయలేని విధంగా తెలంగాణ రాష్ట్ర తొలి సీఎం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటు, కళ్యాణలక్ష్మి షాదీముబారక్ ఆసరా పింఛన్, మిషన్ భగీరథ, అలాగే అనేకమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి నేరుగా ప్రజలే లబ్ధి పొందే విధంగా పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక నాయకుడు కేసిఆర్ ని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్తకు బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం పొందిన వారికి ప్రమాదవశాత్తు మరణించిన వారి కుటుంబానికి బిఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌కి, గద్వాల్ ఎమ్మెల్యేకి బిఆర్ఎస్ పార్టీకి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గోపాల్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి, రాధాకృష్ణరెడ్డి, నరేందర్‌రెడ్డి, బీచుపల్లి, లక్ష్మీకాంత్ రెడ్డి, కృష్ణ, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి కె. రాములు

**మక్తల్ టౌన్, జులై 03 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి కె. రాములు డిమాండ్ చేశారు. బుధవారం మక్తల్‌లో తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (అనుబంధం ఐఎఫ్‌టియు) కమిటి ఆధ్వర్యంలో మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో గేట్ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దోగి అశోక్ అధ్యక్షత వహించగా ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి కె. రాములు మాట్లాడుతూ సబ్బులు, చెప్పులు, నూనెలు, బట్టలు ఇవ్వాలని వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మక్తల్ పట్టణంలో జనాభా పెరిగింది, మురికి పెరిగింది, చెత్త పెరిగింది. తొలగించే కార్మికుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. 80 మంది కార్మికుల అవసరం ఉండగా 40 మంది కార్మికులతో ప్రస్తుతం పని చేస్తున్నారు. రెండు సంత్సరాలు గడిచిన కార్మికులకు సంబంధించిన సబ్బులు, నూనెలు, బట్టలు, చెప్పులు ఇవ్వకుండా కాలం వెల్లదీస్తున్నారన్నారు. సేఫ్టీ కిట్స్ కూడా ఇవ్వడం లేదన్నారు. మున్సిపల్ వార్షిక బడ్జెట్‌లో మున్సిపల్ కార్మికులకు కేటాయించినటువంటి నిధులు ఏమయ్యాయో తెలియడం లేదన్నారు. వెంటనే కార్మికులకు రావాల్సినటువంటి నూనెల, సబ్బులు, బట్టలు, చెప్పులు సేఫ్టీ కిట్స్ ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు ఈశ్వరయ్య, గంగన్న, ఆశన్న, రవి, బండారి బాలు, జి. కృష్ణయ్య, మహేశ్వరమ్మ, శంకరమ్మ, సుజాత, ఆకాశ్, హన్మంతు, రామలింగం, వెంకటేష్, డి. నర్సింలు, బండారి మల్లేష్, మారుతి, మారెప్ప, జగ్గలిబాబు, జగ్గలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవకు అంకితం కావాలి : జెడ్పీ చైర్మన్



జిల్లా పరిషత్ చైర్మన్ ఆత్మకూరు ఎంపీపీని సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ జులై 03 ప్రభాతవార్త :** ప్రజలకు సేవ చేసేందుకు ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు ప్రజాసేవకే అంకితమై పని చేయాలని వనపర్తి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ లోక్నాథ్ రెడ్డి అన్నారు. బుధవారం రోజు ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఎంపీపీ జడ్పిటిసి సభ్యుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యాఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సాధారణంగా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి వస్తుంటాయని ప్రజాప్రతినిధులుగా నిలబడ్డ వారు మాత్రం ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలకు అంకితమై ప్రజాసేవకు పాత్రులు కావలని తద్వారా ప్రజలు జీవింతాంతం గుర్తించి ఉంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలే పరామర్ధిగా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో ఆత్మకూర్ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు విలువలకు కట్టుబడి పని చేశాడని ఆయన పొగడ్తలతో ముంచెత్తారు. అనంతరం ఎంపీపీ శ్రీనివాసులు జెడ్పిటిసి రాని వైస్ ప్రెసిండెంట్ కోటేశ్వర్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సింగిల్ విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి లక్ష్మీకాంత్ రెడ్డి మాజీ ఎంపీపీ మొగలి శ్రీధర్ గౌడ్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సర్పంచులు ఎంపీటీసీ సభ్యులు కో ఆప్షన్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## నేడు కంసాన్‌పల్లికి ఎమ్మెల్యే రాక

**ఉప్పునుంతల, జులై 03 ప్రభాతవార్త :** మండలంలోని కంసానిపల్లి గ్రామంలో నేడు ఉదయం 9 గం.లకు సిసి రోడ్డు పనులకు అచ్చంపే ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా సిసి రోడ్డుకు భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి అరుణ నర్సింహారెడ్డి తెలిపారు. అదేవిధంగా ఎంపిటిసిల పదవీకాలం నేటితో ముగియడంతో నేడు గురువారం మండల కేంద్రంలోని యశోద ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గం.కు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి పేర్కొన్నారు. కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని ఎంపిపి తెలిపారు. కార్యక్రమానికి ఎంపిటిసిలతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని వారు కోరారు.

## కొండ ఇండస్ట్రీస్ రైస్ మిల్లుపై కేసు నమోదు



రైస్ మిల్లును సందర్శించిన ఆత్మకూరు సిఐ,ఎస్సై

**ఆత్మకూర్ జులై 03 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని కొండ ఇండస్ట్రీస్ రైస్ మిల్లు యాజమాన్యాలపై కేసు నమోదు చేసిట్లుగా ఆత్మకూర్ సిఐ మహేష్ కుమార్ ఎస్సై నరేందర్లు విలేకరులకు తెలిపారు. ఈ మేరకు వారు బుధవారం రోజు ఆత్మకూర్ పౌర సరఫరాల శాఖ అధికారుల ఫిర్యాదు అందుకున్న వెంటనే రైస్ మిల్లును సందర్శించి పరిశీలించారు. 2021-22, 2022-23 సంవత్సరానికి సంబంధించి దాదాపుగా రెండు కోట్ల రూపాయలకు పైబడి ధాన్యాన్ని పౌర సరఫరా శాఖకు అందించాల్సి ఉండగా నేటి వరకు పలు నోటీసులు జారీ చేసినప్పటికి యాజమాన్యం స్పందించకపోవడంతో ఆత్మకూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే రైస్ మిల్లు యజమాని కొండపై కేసు నమోదు చేసినట్లుగా సీఐ ,ఎస్సై తెలిపారు.

# సాంఘిక సంక్షేమ బిసి వసతి గృహాలలో కొత్త మెనూ ఏర్పాటు చేయాలి



విద్యార్థులతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రాజు

**ఇటిక్యాల జులై 03 ప్రభాతవార్త:** జిల్లాలో ఉన్న సాంఘిక సంక్షేమ బిసి వసతి గృహాలలో ఈ ఏడాది కొత్త మెనూ ఏర్పాటు చేయాలని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు జిల్లా ఉన్నతాధికారులను కోరారు. బుధవారం కెవిపిఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలోని బిసి బాలుర వసతి గృహాన్ని సందర్శించి సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాటం సంఘం

◆ బిసి హాస్టల్‌ను సందర్శించిన కెవిపిఎస్ నాయకులు

కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ వసతి గృహాలు తెరచి 3 వారాలు గడుస్తున్న ఇప్పటికీ జిల్లా సాంఘిక సంక్షేమ అధికారులు కొత్త మెనూ ఏర్పాటు చేయకపోవడం దారుణమన్నారు. గత ఏడాది మెనూ అమలు చేస్తున్నారని ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తక్షణమే జిల్లాలో ఉన్న ఎస్సీ,ఎస్టీ,బీసీ వసతి గృహాలకు కొత్త మెనూఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.లేనియెడల ఆందోళనలు చేస్తామనిహెచ్చరించారు. ఈ సందర్భంగా ధర్మవరం బీసీ వసతి గృహంలో 4 గదులకు తలుపులు కిటికీలు లేవని 7 గదులలోఫ్యాన్లు ఉన్న తిరగడం లేదని 2గదులలో కరెంటు బోర్డులు స్విచ్‌లు పగిలిపోయాయని అలాగే విద్యార్థులకు రుచిక రమైన బోజనం పెట్టడం లేదని విద్యార్థుల నోటికాడి కూడు లాగే ప్రయత్నం వసతి గృహ వార్డెన్ చేస్తున్న జిల్లా అధికారులు పట్టించుకోవడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులకు ఉప్పు కారం లేని చప్పటి అన్నం పెడుతున్నారని వాటి వల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారని బిసి వసతి గృహానికివచ్చిన సోలార్ లైట్లుబిగించలేదని ఇన్వెటర్లుఉపయోగంలో పెట్టలేదని ఫిల్టర్ నీళ్ల మిషన్ వచ్చిన ఉపయోగించడం లేదన్నారు. వసతి గృహ వార్డెన్ రెగ్యులర్‌గావిధులకు హాజరు కావడంలేదని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు త్రాగడానికి గ్లాసులు లేక ప్లేట్లతో మంచినీళ్ల తాగు తున్నారని వసతిగృహంలో 14స్నానపు గదులుఉన్నవాటికి లైట్లులేవని 4 మరుగు దొడ్లు ఉన్న లైట్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే జిల్లా అధికారులువసతి గృహాన్ని సందర్శించి సమస్యలు పరిష్కరించాలని లేనిచో విద్యార్థులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.



ప్లేట్ల ద్వారా నీటిని తాగుతున్న విద్యార్థులు

## రెండు వారాల్లో జాబ్ క్యాలెండర్

◆ఆరునెలల్లో 28,942 ఉద్యోగాల భర్తీ ◆టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్



మాట్లాడుతున్న జహీర్ అఖ్తర్

**మహబూబ్‌నగర్ బ్యూరో,జులై03 ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగుల సంక్షేమానికి పాటుపడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టిపిసిసి అధికార ప్రతినిధి జహీర్ అఖ్తర్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు.ప్రభుత్వ శాఖల్లో నియామకాలు చేయలేదన్నారు. అప్పటి బిఆర్ఎస్,ఇప్పుడు బిజెపి లీకేజీల ప్రభుత్వాలని ఎద్దేవా చేశారు.నిరుద్యోగులను మోసం చేసినందుకే బిఆర్ఎస్ గత ఎన్నికల్లో ఓడిపోయిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 28,942 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. గ్రూప్ 4 ఫలితాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల యూపి ఎస్సీ బోర్డు పనితీరును పరిశీలిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగుల సమ స్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రెండు వారాల్లో జాబ్ క్యాలెండర్ విడుదలవుతుందని, నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మనజిల్లా బిడ్డఅని,ఇక్కడి ప్రాంతాన్ని ఎడ్యుకేషన్ ఎంప్లాయ్‌మెంట్ హబ్‌గా మార్చడానికి కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు.సమావేశంలో డిసిసి మీడియా సెల్ కన్వీనర్ సిజె బెనహర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ షబ్బీర్ అహ్మద్, పట్టణ కాంగ్రెస్ వర్కింగ్‌ప్రెసిడెంట్ అజ్మత్ అలీ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు అవేజ్ అహ్మద్, మాజీ కౌన్సిలర్ బాలస్వామి పాల్గొన్నారు.

## నేడు బీజేపీ విజయోత్సవ ర్యాలీ

**మహబూబ్‌నగర్, జులై3, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎంపీగా డీకే అరుణ గెలుపొందిన తర్వాత మొదటి సారి జిల్లా కేంద్రానికి రానున్నారు. ఈనేపథ్యంలో గురువారం బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తు విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉదయం 11.30 గంటలకు ఉమ్మడి జిల్లాలోని కొత్తూరు నుంచి ర్యాలీ ప్రారంభమై షాద్‌నగర్,బాలానగర్, రాజాపూర్,జడ్చర్ల, అప్పన్నపల్లి మీదుగా ఎస్‌వీఎస్ దవాఖానకు చేరుకుంటారు. అక్కడి నుంచి మధ్యాహ్నం అన్నపూర్ణ గార్డెన్స్‌లో అరుణమ్మ అభినందన సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా డీకే అరుణ సభలో ప్రసంగించనున్నారు?

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**కెటిదొడ్డి,జులై 03 ప్రభాతవార్త:** మండల పరిధిలో బుధవారం తెల్లవారుజామున 3 గం.లసమయంలో మల్లాపురం తండాలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో చౌరస్తా దగ్గరలో ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు తనిఖీ చేసి పట్టుకున్నారు.అనుమతులు లేనందున పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గవ్వ తిమ్మప్ప తండ్రి తిప్పన్న అనే వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌గా నంబర్ టిఎస్ 33 టి 2725 డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌రావు తెలిపారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో జోరుగా సాగుతున్న కేఎల్ఐ పనులు



కేఎల్ఐ కాల్వ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

**వెల్దండ, జులై 03 ప్రభాతవార్త:** కేఎల్ఐ డీ82 పనులు గత 5 సంవత్సరాల నుంచి మండలంలో నత్తనడకగా కొనసాగాయి. మండలంలో చెర్కూర్ వరకు కాల్వ పనులు అయినప్పటికి చెర్కూర్ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ రైతు పొలంలో టేకు చెట్లు ఉన్నందున రైతు అడ్డు చెప్పడంతో గత ఐదు సంవత్సరాల నుంచి కేఎల్ఐ పనులు 400 మీటర్ల మేర పనులు ఆగిపోయాయి. దీంతో కేఎల్ఐ కాల్వ ముందుకు సాగక నిలిచిపోయాయి.ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందినప్పటి నుంచి కేఎల్ఐ డీ82పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పలుమార్లు అధికారులకు సమీక్షించి పరిష్కారమయ్యే విధంగా చొరవ చూపి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులతో సంప్రదించి నిధులు మంజూరు చేశారు. పనులు నిలిచిన చోట నుంచి పనులను వేగవంతంగా యుద్ధప్రతిపాదికన పనులు ప్రారంభించాలని, వెను వెంటనే పనులను ప్రారంభించారు. 400 మీటర్ల కేఎల్ఐ కాల్వ పనులు శరవేగంగా చేపడుతున్నారు. 400 మీటర్ల కాల్వ పనులు పూర్తైతే ఆమనగల్లు, మాడ్గుల మండలానికి సాగునీరు అందుతుందన్నారు. పనులు పూర్తైనచో కృష్ణా నది నిండిన వెంటనే కేఎల్ఐకి సాగునీరు విడుదల చేస్తే మండలంలో పూర్తి స్థాయిలో రైతులకు సాగునీరు అందుతుందని మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**వెల్దండ, జులై 03 ప్రభాతవార్త:** వెల్దండ మండలం పోచమ్మగడ్డతాండ గ్రామ పంచాయతీ పరిధిలో దుబ్బతాండకు చెందిన వద్యవత్ బిచ్యా నాయక్ మృతి చెందారు. మృతుడి కుటుంబాన్ని సర్పంచ్ వరలక్ష్మి పంతులానాయక్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉండి ఆదుకుంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వెంకట్రామ్‌నాయక్, హన్మంతునాయక్, సేవ్యానాయక్, రేఖ్యానాయక్, లక్ష్మణ్‌నాయక్, జైపాల్ నాయక్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## మండల ప్రత్యేకాధికారి నియామకం

**వెల్దండ, జులై 03 ప్రభాతవార్త:** ఈ నెల 3తో ఎంపీపీ, ఎంపీటీసీల పదవికాలం ముగియడంతో జిల్లా అధికారులుమండల ప్రత్యేకాది. కారిని నియమించారు.మండల ప్రత్యేకాధికారిగా జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ఖాజానిజాం అలీ నియమితులైనట్లు ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి తెలిపారు.

## గురుకులంలో వనమహోత్సవం

- మొక్క నాటిన జెడ్పీ వైస్ ఛైర్మన్ యాదయ్య

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 3, ప్రభాతవార్త:** జడ్చర్ల మైనార్టీ పాఠశాలలో బుధవారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ ఛైర్మన్ కోడ్గల్ యాదయ్య పాఠశాలను సందర్శించి మొక్కలు నాటి విద్యార్థులతో కలిసి నీళ్లు పోశారు. తెలంగాణ ప్రభుత్వం 204 మైనార్టీ గురుకులాలు స్థాపించి విద్యకు ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. లక్షలాది విద్యార్థులకు నేడు కార్పొరేట్ స్థాయి విద్య అందుతుందన్నారు. పాఠశాలలో వసతులపై ఇన్‌చార్జి హెచ్ఎం పరియా జకియాను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉదయ్‌కుమార్,మాజీ సర్పంచ్ రాములు, ముడా మాజీ డైరెక్టర్ ఇంతియాజ్ ఖాన్,కరాటే శ్రీను, డి బాలరాజు పాల్గొన్నారు.



## బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం



బాలల చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అవుట్ రిచ్ వర్కర్ నరేష్

**వనపర్తి ప్రతినిధి జులై03 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లాలోని కడుగుంట్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బాలలను ఉద్దేశించి భవిష్యత్తులో భావితరాలకు సందేశాత్మకంగా ఆడపిల్లల చదువులను కొనసాగించాలని అదేవిధంగా ఆడపిల్ల అంటే కేవలం ఇంటికి మాత్రమే పరిమితం కాదని దేశ అభివృద్ధికి సమాజాభివృద్ధికి తోడ్పాటును అందించగలని, చదువుకునే దశలో అమ్మాయిల పట్ల అబ్బాయిలు సత్ప్రవర్తనతో కలిగి ఉండాలని అంతేకాకుండా బాలికలను, ఆడపిల్లలు చదువుకునే వయసులో ఎటువంటి అశ్రద్ధ వహించరాదని చెడు అలవాటులకు, అమ్మాయిలు అట్రాక్షన్‌కు గురై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని తమ తల్లిదండ్రులు ఆశలను దృష్టిలో ఉంచుకొని వారు కన్నా కళలను నెరవేర్చాలని తమ తల్లిదండ్రుల గౌరవ మర్యాదలను కాపాడలని వివరించడం జరిగింది.అదే విధంగా 1098,112,100,181 యొక్క సేవలను వినియోగించుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దిలేటి తోటి ఉపాధ్యాయులు, జిల్లా బాలల పరిరక్షణవిభాగంనుండిఅవుట్‌రీచ్‌వర్కర్‌నరేష్,రవి.రాజు,అశోక్ కుమార్ పాల్గొన్నారు.

## జులై 4వ తేదీ నుండి వనపర్తి జిల్లా కలెక్టర్‌గా అదనపు కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు

**వనపర్తి ప్రతినిధి జులై 03 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తన వ్యక్తిగత కారణాల వల్ల జులై 4వ తేదీ నుండి జులై 25 వరకు సెలవుపై వెలుచున్నందున వారి స్థానంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ను కలెక్టర్‌గా పూర్తి బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేడు ఉత్తర్వులు జారి చేశారు. సెలవు అనంతరం తిరిగి ఆదర్శ్ సురభి వనపర్తి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## స్థానిక ప్రజా ప్రతినిధులే గ్రామాల అభివృద్ధికి మూలం



ఎంపిపి, ఎంపిటిసిలను సన్మానించిన జిఎంఆర్

**అడ్డాకుల,జులై03 ప్రభాతవార్త:** గ్రామాలలో అభివృద్ధికి పనులు చేపట్టడానికి ప్రజలకు అందుబాటులో ఉండి గత ఐదు సంవత్సరాలు ప్రజల అవసరాలు తీర్చడానికి స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులే ముఖ్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. సర్వసభ్య సమావేశ మందిరంలో ఎంపిడిఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంపిపి వైస్ ఎంపిపి మండల ఎంపిటిసిల పదవికాలం ముగిసిన సందర్భంగా ఎంపిపి వైస్ ఎంపిపి మండల ఎంపిటిసిలను పూలమాలలు వేసి సన్మానించారు. సమావేశంలో అన్ని గ్రామాల ఎంపిటిసిలు వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసిలు, మండల కో ఆప్షన్‌ను సన్మానించిన జడ్పీటిసి



**అడ్డాకుల,జులై 03 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్ద మునగాల్‌చేడ్ స్వగృహంలో మండలంలోని ఎంపిటిసిలు మండల కో ఆప్షన్ పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీటిసి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎంపిటిసిలు మండల కో ఆప్షన్ గత ఐదు సంవత్సరాలు గ్రామాల అభివృద్ధి కార్యక్రమంలో కీలక పాత్ర పోషించారు. ప్రజాప్రతినిధుల వెన్నంటే ఉంటూ సంక్షేమ అభివృద్ధిలో భాగస్వాములు అవుతూ సహకరించారని తెలిపారు. భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అధికారం ఉన్న లేకున్నా ప్రజాక్షేత్రంలో ఉంటూ గ్రామాల అభివృద్ధికి సహకరిస్తూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఎంపిటిసిలు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు రంగన్నగౌడ్, సింగిల్ విండో ఛైర్మన్ జితెందర్‌రెడ్డి, మండల అధ్యక్షులు టి. శ్రీనివాస్‌రెడ్డి, వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ వైర్లు తెగి మూడు ఆవులు మృతి



**అడ్డాకుల,జులై 03 ప్రభాతవార్త:** మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి పాడి ఆవులు బుధవారం పొలం దగ్గర విద్యుత్ వైర్లు తెగి మూడు ఆవులు మృతి చెందడం జరిగింది. ఆవుల నష్టపరిహారం విలువ ఒక్కోటి రూ.50 వేల చొప్పున ఉంటుందని ప్రభుత్వం తరపున విద్యుత్ అధికారులు ఆదుకోవాలని రైతు చంద్రశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం!

◆ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

**జడ్చర్ల, జులై 3, ప్రభాతవార్త:** ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా బుధవారం ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తయారు చేసిన వస్త్ర సంచులు, జ్యూట్ బ్యాగులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత బ్యాగులను ఉపయోగించాలని, ప్రతి చిన్న అవసరాలకు ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించడంత పర్యావరణ ముప్పు ఏర్పడుతుందని, వన్యప్రాణులకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని సూచించారు. ప్లాస్టిక్ రహిత బ్యాగులను తయారు చేసినఉమెన్ డెవల్‌మెంట్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ,గోపాల్‌గౌడ్, భానుప్రకాశ్,కుట్టు శిక్షణశిబిరం మహిళలు పాల్గొన్నారు.





వస్త్ర సంచులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

# గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించిన జడ్చర్ల ఎమ్మెల్యే

**బాలానగర్,జులై03 ప్రభాతవార్త:** బాలానగర్ మండలంలోని మన్నెగూడ తండా, పెద్దబావి తండా గ్రామ పంచాయతీ నూతన భవనాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామ పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటారు. గత ప్రభుత్వంలో అన్ని స్థాయిలలో అవినీతి అక్రమాలు జరిగాయని, నాయకులు గ్రామాలను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. గత ప్రభుత్వానికి కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరుకు చాలాతేడా ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని సామాన్యులకు న్యాయం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. త్వరలోనే బాలానగర్ నుండి గంగాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించబోతున్నామని, ఈ కార్యక్రమానికి రోడ్డు రవాణాశాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే బూర్గుల గ్రామం నుంచి హేమాజీపూర్ వయాలింగారం నుంచి పెద్దరే వల్లి గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు కూడా చేపట్టబోతున్నట్లు తెలిపారు. పాలకుల పనితీరును గమనిస్తున్నారని, తాము చేసే పని చెబుతామే తప్ప చేయని పని గురించి చెప్పమని ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి వెంకట్‌రామ్‌నాయక్, తహసిల్దార్ శ్రీనివాస్‌రెడ్డి,ఎంపిఓ విజయకుమారి, రిటైర్డ్ ఏఎస్పీహాతిరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

# వికాలంగులు హక్కుల కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలి

ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మహాజన్

**వనపర్తి టౌన్ 03 ప్రభాతవార్త:** మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వికలాంగులకు సమావేశంలో గంధం గట్టయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమన్వయకర్త మాట్లాడుతూ.. వికలాంగుల హక్కులు, సంక్షేమం, సమస్యల పరిష్కారం కోసం, 6000/- వేల పింఛన్ సాధన కోసం, వికలాంగులకు ఇచ్చన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ విహెచ్‌పిఎస్ వనపర్తి జిల్లా సదస్సును ఏర్పాటు చేయాలని కోరారు. విహెచ్‌పిఎస్ నూతన కమిటీల నిర్మాణాలు, గ్రామ స్థాయిలో వికలాంగుల ఉద్యమాన్ని బలోపేతం చేయడం, వారి హక్కుల సాధన కోసం మరో కార్యాలచరణ పై చర్చించడం జరిగింది. జిల్లా వికలాంగుల విభాగాన్ని సమన్వయం చేయడం కోసం గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు నూతన కమిటీలను నిర్మించడం కోసం సమన్వయ కమిటీని నియమించి జులై 5 న వికలాంగులకు 6000 వేలు వృద్దులు, వితంతువులు ,ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు, గీత కార్మికులకు 4000 పింఛను సాధనకై జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ ముందు మహాధర్నా కార్యక్రమం ఉంటుందని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జులై 7న ఎమ్మార్పీఎస్ 30 ఏండ్ల ఆవిర్భావ దినోత్సవ కవాతు గ్రామ గ్రామాన దండోరా జెండా ఆవిష్కరణలు విజయవంతం కోసం అన్ని వర్గాల ప్రజలను భాగస్వామ్యం కావాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభాకర్ శెట్టి వికలాంగుల హక్కుల పోరాట సమితి వనపర్తి జిల్లా కన్వీనర్ గంధం కృష్ణయ్య విహెచ్‌పిఎస్ వనపర్తి జిల్లా నాయకులు గంధం లక్ష్మయ్య, విహెచ్‌పిఎస్ వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు కుశ కుమార్ శెట్టిని విహెచ్‌పిఎస్‌నాయకులునాగరాజు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు

# జిహెచ్‌ఎం పదవి విరమణ అభినందన సభ

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి జిహెచ్‌ఎం ఆనంద్‌కుమార్ : డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి

**రాజాపూర్,జులై 03 ప్రభాతవార్త:** సమాజంలో ఉపాధ్యాయులు విశేష స్థానం ఉంటుంది. తల్లిదండ్రుల తర్వాత గురువునే దైవంగా కొలిచే సంస్కృతి మనది. అందుకే గురుబ్రహ్మ గురు విష్ణు గురుదేవో మహేశ్వర గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురువే నమ: అని అంటాము. ఎందుకంటే తల్లిదండ్రులు పిల్లలకు జన్మనిస్తారు. గురువులు ఆ పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పించి వారిని సన్మార్గంలో నడిపించి వారి పురోగతికి బాటలు వేస్తుంటారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభా కర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి జిహెచ్ఎ ఆనంద కుమార్ అంటూ రాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు సంవత్సరాలుగా ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్ది పదవి విరమణ పొందుతున్న జీహెచ్‌ఎం ఆనంద కుమార్ సేవలు మరువలేనివని ఆయన ప్రశంసించారు. పదవి విరమణ మహోత్సవాన్ని పురస్కరించుకుని అభినందనసభను డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి సుశీల రమేష్‌నాయక్, వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ అల్తాఫ్ బేగ్, ఎంపిటిసి శేఖర్ గౌడ్, మాజీ ఎంపిపి నర్సింలు, మాజీ సర్పంచ్ బచ్చిరెడ్డి, ఆనంద్‌గౌడ్, నరహరి, గోపికాంత్‌రెడ్డి,గోనెల రమేష్, తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపిడిఓ మశ్చేందర్, మండలంలోని విద్యావంతులు, విద్యార్థులు, పూర్వపు విద్యార్థులు,ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు హాజరై పదవీ విరమణ సన్మాన సభను విజయవంతం చేశారు.



జిహెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

# గద్వాల ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని జడ్పిచైర్మన్‌కు వినతి

**గద్వాల ప్రతినిధి జులై3 ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలుపొందిన గద్వాల నియోజకవర్గ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి నిజంగా గద్వాల అభివృద్ధి కోరకే కాంగ్రెస్ పార్టీలో చేరాలంటే, మొదట ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రాజీనామా చేసిన అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరాలన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు డిమాండ్ బుధవారం డిమాండ్ చేశారు. గద్వాల ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీలో చేరికను అడ్డుకుంటామన్నారు.టిపిసిసి అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి ఎమ్మెల్యే ను చేర్చుకోవద్దని, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పి చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ సరిత కు కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వంలో అధికార పార్టీ బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి చేయలేని ఎమ్మెల్యే ఇప్పుడు కాంగ్రెస్ లో చేరి ఏమి అభివృద్ధి చేస్తాడని ప్రశ్నించారు. ఎమ్మెల్యే చేసిన అవినీతి, అక్రమాలు ఏ గ్రామానికి వెళ్లిన ప్రజలే చెప్పుతారు అన్నారు. ప్రతి అభివృద్ధి పథకంలో చేసిన స్కాంలు బయటపడతాయనే ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పార్టీ మార్పుకు కంకణం కట్టుకున్నారు అని అన్నారు. గద్వాల ఎమ్మెల్యే, ఇప్పుడు పార్టీ అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ పార్టీలో చేరాలని తమ కార్యకర్తలతో సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు, ఓట్లు వేసిన ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గట్టు కృష్ణమూర్తి, అమరాయి కృష్ణా రెడ్డి, లత్తిపురం వెంకట్ రామి రెడ్డి, వెంకట్ స్వామిగౌడ్, కౌన్సిపర్‌లు కోటేష్, నర్సింహ, నరహరిగౌడ్, నాయకులు రాజ శేఖర్‌రెడ్డి, జాంపల్లి వెంకటేష్వర్‌రెడ్డి,ఇశాక్, తదితరులు కార్యకర్తలు, ప్రజలు ఉన్నారు.



గద్వాల ఎమ్మెల్యేను కాంగ్రెస్‌లో చేర్చు కోవద్దని జడ్పిచైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

## 100కాదు.. 30 పడకలే..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేల అనిరుధ్‌రెడ్డి

లేదని ఎమ్మెల్యే చెప్పారు. ఇక మీద బాధ్యత తనదని, వచ్చే వారం జిల్లాలో సీఎం పర్యటన ఉందని, మాట్లాడి దవాఖానలో సమస్యలు పరిష్కరిస్తాని, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరిస్తానని చెప్పారు. కావాల్సిన సిబ్బంది, వైద్యులు, వసతులు అన్ని కల్పిస్తానని స్పష్టం చేశారు. అతిత్వరలోనే నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని, జడ్చర్లతో పాటు గంగా పూర్ రెండు లైన్ల ద్వారా దవాఖానకు విద్యుత్ సరఫరా చేస్తామన్నారు.

**123మందికి 34మంది సిబ్బందే..:** ఈ సందర్భంగా దవాఖాన సూపరింటెండెంట్ సోమశేఖర్ మాట్లాడుతూ స్టాఫ్ నర్సు 16మంది, శానిటేషన్ సిబ్బందిని ఇవ్వడంతో ప్రస్తుతం కొంత మెరుగైందన్నారు. ఎక్విప్‌మెంట్ సరిపడా ఉన్నా, వైద్యులు, పారా మెడికల్ స్టాఫ్ ఇంకా కావాల్సి ఉందన్నారు. దవాఖానలో మొత్తంగా 123మంది సిబ్బంది ఉండాలని, కానీ ప్రస్తుతం 34మంది ఉన్నారని ఇటీవలె 16మంది స్టాఫ్ నర్సులను ఇచ్చారని పేర్కొన్నారు. ఇంకా 73మంది సిబ్బంది అవసరం ఉందని వివరించారు. దవాఖానలో మంగళవారంకరెంట్ 3గంటలులేదనే విషయంస్పంది స్తూ కేవలం 20నిమిషాలు మాత్రమే లేదని, జనరేటర్‌లో పెట్రోల్ అయిపోయిన కారణంగా తీసుకొచ్చి ఆన్ చేయడానికి కొంత సమయం పట్టిందని చెప్పు కొచ్చారు. ఎమ్మెల్యే వెంటనాయకులు బాద్మిరవిశంకర్, కౌన్సిలర్ అంజి, కావేరమ్మ పేట మాజీ సర్పంచ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వంశీచంద్‌రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధి విద్యతోనే సాధ్యం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విద్యార్థులతో కలిసి ఎమ్మె ల్యే సహపంక్తి భోజనం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు అభివృద్ధి చెందాలని మన ఊరు మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మొదటి విడత నియోజకవర్గంలో కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి వాటిలో అన్ని మౌలిక సదుపాయాలతో లేకుండా ప్రభుత్వ పాటశాలల్లో కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని మౌలిక సదుపాయాలతో తీర్చి దిద్దడం జరుగుతుందని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం నా వంతు సహాయం సహకారాలు ఎల్లప్పుడూ ఉంటా యని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్ జెడ్పిటిసి బాసుశ్యామల, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్, ఎంపీటీసీ ఆనంద్‌గౌడ్, రంగస్వామి, పారిజాత, జెడ్పి కోఆప్షన్ నెంబర్ ఇమాన్, మండలకోఆప్షన్ నెంబర్ బిఆర్ఎస్‌పార్టీ నాయకులు హనుమంతు నాయుడు, గద్వాల తిమ్మప్ప , ఆలూరు రామయ్య శెట్టి, ఆంజనేయులు గౌడ్, మహేశ్వర్ రెడ్డి, చిన్న గోవిందు, జయన్న, రామకృష్ణ నాయుడు, నరేందర్ నాయక్, నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## డ్రోన్ పైలెట్లకు సహకారం అందేలా కృషి చేస్తాం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

హైదరాబాద్‌లో గత 13 రోజులుగా డ్రోన్, డ్రోన్ డేటా ప్రాసెసింగ్ జిఐఎస్ మ్యాపింగ్, డిజిపిఎస్‌ల కోర్సుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినిలకు తెలంగాణ టూరిజం శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం హైదరాబాద్ రవీంద్రభారతిలోని వారి చాంబర్‌లో డ్రోన్ లైసెన్స్, సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ విద్యార్థి యువత మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నికల్‌రంగాల వైపు దృష్టి పెట్టి ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని ప్రస్తుత వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో రసాయనాలను పిచికారి చేసేందుకు డ్రోన్ల వినియోగం విరివిగా పెరిగిందని దీని దృష్టిలో పెట్టుకొని మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార యుఏవి సహకారంతో ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారందరికి కూడా ప్రభుత్వ పరంగా సహకారం అందేలా కృషి చేస్తానని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో రత్నగిరి ఫౌండేషన్ అడ్వైజర్ జిల్లెల సతీష్, తార యుఏవి మేనేజింగ్ ఆపరేషన్స్, డ్రోన్ ట్రైనర్ డా. విజయ్ కుమార్, డ్రోన్ ట్రైనర్ శ్రీనాథ్, రత్నగిరి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నిద్రావస్థలో నీటిపారుదల శాఖాధికారులు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పడు తుందని రైతులు అంటున్నారు మరమ్మత్తు పనులలో అలస్యం ప్రధాన కుడి కాల్వలో పలు చోట్ల లైనింగ్ డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు నీటి విడుదలకు ఏర్పాటు చేసిన తూములు పెద్ద దెబ్బతి న్నాయి .దీంతో పంట పొలాలకు సరిపడే నీరు కాలుదల ద్వారా అందడం లేదని రైతులు అంటున్నారు .మరమ్మతుల కోసం అధికారులు నవంబరులో ప్రతిపాదనలు పంపినా జనవరిలోఅనుమతి వచ్చింది పనులకు టెండర్లు పిలిచిన అనంతరం ఎమ్మెల్సీ,ఎంపీ ఎన్నికల కోడ్ రావటంతో బిడ్ తెరవటానికి మూడు నెలల ఆలస్యమైంది.వాటిని తెరిచి గుత్తెదారు లకు ఒప్పందం ఇవ్వటానికి మరో నెల పట్టిందని అధికారులు అంటున్నారు .ప్రస్తుతం పనులు మొదలయ్యాయి ,అవి పూర్తికావ దానికి మరో 15 రోజులు అనంతరం క్యూరింగు 10 నుంచి 20 రోజులు పట్టే అవకాశముందని డిఈ ఎల్లయ్య తెలిపార క్యూరింగ్ సరిగా లేకుంటే నీటిని విడుదల చేసినపుడు ప్రవాహం ధాటికి లైనింగ్ కొట్టుకుపోయే పరిస్థితి ఉంటుంది .జలాశయంలో నీళ్లున్నా మరో నెల రోజులు కాల్వకు విడుదల చేసే అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు ఎదురువుతాయని అన్నదా తలు అంటున్నారు.ఆరో డిస్ట్రిబ్యూటరీ పరిధిలో సొంత ఖర్చుతో రైతులు పూడిక తీయించుకుంటున్నారు.కుడి కాల్వ పరిధిలో అనేక చోట్ల లైనింగ్, డిస్ట్రిబ్యూటరీ కాల్వలకు నీరు విడుదల చేసే తూములు దెబ్బతిన్నాయి .వీటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాల్సి ఉండగా ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతుల కోసం కేవలం రూ.36 లక్షలు మాత్రమే మంజూరు య్యాయని అధికారులంటున్నారు.గతంలో కాడాకు కమాండ్ ఏరియా డెవెలప్మెంట్ ఆథారిటీకి రూ.రెండు కోట్ల వరకు ప్రతిపాదనలు పంపినా మంజూరు జాడలేదు.కాల్వకు నీళ్ల దిలే ముందర మరమ్మతులు ఏంటని ,గుత్తేదా రులకు లబ్దిచేకూర్చటం,తప్ప వీటితో శాశ్వత పరిష్కరం ,ప్రయోజనం ఉండదని రైతులంటున్నారు.ప్రభుత్వం నుంచి నిధుల రాకపోవ టంతో 6 న డిస్ట్రిబూట్యరీ వెంకం పేట పరిధిలో600 ఎకరాల ఆయకట్టుకు నీటి సమస్య ఉంది .కాల్వల పరిస్థితి డిస్ట్రిబ్యూటరీ అధ్వానంగా ఉంది . చేసేది లేక ఎకరాకు రూ200 చొప్పున 1.20 లక్షలు పోగేసి మేమేపూడిక తీయించుకుంటున్నాం రైతులు అంటున్నారు.జూరాలకు వరద మొదలయ్యే నాటికి పనులు పూర్తి చేయించి కాల్వకు నీటిని విడుదల.చూసేలా చూస్తాం అని డిఈ ఎల్లయ్య తెలిపారు .ప్రస్తుతం ప్రధాన కాల్వలో మేజర్గా సీసీలైనింగ్ దెబ్బతిన్న చోట పనులు చేయిస్తున్నాం అన్నారు పూర్తి కాగానే ఆయకట్టుకు నీటిని అందించేందుకు చర్యలు చేపడుతాం అని డిఈ ఎల్లయ్య అన్నారు .

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు ధరఖాస్తుల ఆహ్వానం : డీఈఓ

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 03 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోజాతీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2024కు 10 సంవత్సరాల కాలం సర్వీస్ పూర్తి చేసుకొని అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 15లోగా సంబంధిత వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ యం.గోవిందరాజులు బుధవారం తెలిపారు. 2 కాపీలను సంబంధిత మండల విద్యాశాఖ అధికారి ధృవీకరణతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. ప్రభుత్వ యజమాన్యాల పరిధి ప్రాథమిక, యూపీఎస్, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కేంద్రీయ, జవహర్‌నవోదయ, సైనిక్‌స్కూల్, ఆటమిక్‌ఎనర్జీ ఎడ్యూకేషన్, సోసైటీ, ఏకలవ్య, మోడల్, ఆశ్రమ, సెంట్రోల్ బోర్డు సెకండరి ఎడ్యూకేషన్‌చే అఫిలియేషన్ పొందిన సంస్థలు, ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ పొందిన పాఠశాలల ఉపా ధ్యాయులు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ విధి విధానాలు నేషనల్ అవార్డు టీచర్స్ వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయులు మరియు ప్రధానోపాధ్యాయులు ఈ నెల 15తేదీలోగా ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ప్రకటనలో తెలిపారు.

## వెస్టేజ్ స్టాక్ పాయింట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**రాజాపూర్, జులై 03 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభ్యు ఆసుపత్రి రోడ్డులో రాజాపూర్ మండలం ఇదిగానిపల్లి గ్రామానికి చెందిన కర్నెకోట రమేష్ నూతనంగా నెలకొల్పిన వెస్టేజ్ స్టాక్ పాయింట్‌ను బుధవారం జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వెస్టేజ్ స్టాక్ పాయింట్‌లో ఆర్గానిక్ ఐటమ్స్, హెల్త్‌కేర్, బ్యూటీకేర్, అగ్రికల్చర్, హోమ్‌కేర్ తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయని ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకునే వారు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వనపర్తి నరహరి, పట్లోళ్ల గోవర్ధన్‌రెడ్డి, మైనార్టీ నాయకులు నసీర్‌బేగ్, వెంకటేశ్వర్‌రెడ్డి, గోనెల రమేష్, శివారెడ్డి, ఇస్తారయ్య, మల్లయ్య, తఖీబాబా, సాయి తదితరులు పాల్గొన్నారు.

# చెంచు మహిళ ఈశ్వరమ్మకు ప్రభుత్వ భరోసా

- **పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి**
- **గిరిజనులందరూ ఆధార్ కార్డు నమోదు చేసుకోవాలి**
- **నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**

**కొల్లాపూర్, జులై03 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మొలచింత లపల్లి గ్రామాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి చెంచు మహిళ ఈశ్వరమ్మను పరామర్శించారు. గ్రామంలోని భ్రమరాంబ కాలనీలో చెంచుల సమస్యలపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ బుధవారం ఉదయం బాధిత మహిళ ఈశ్వరమ్మ ఇంటికి వెళ్లి బాధిత మహిళా ఆరోగ్య వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆమె ఇంటికి వచ్చిన సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాలను పిల్లల చదువు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారికి కావాల్సిన అవసరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రూ.5 లక్షలతో ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వ్యవసాయ భూమి సాగు చేసేలా నీటి అవసరాలను తీర్చేలా చూడాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శపాఠశాల పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్ల, కంపౌండ్ వాల్ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులు పెండింగ్ లేకుండా వెంటనే పూర్తి చేయించుకోవాలని హెడ్మాస్టర్ సూచించారు. పనులకు ఎలాంటి నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలనుఅడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతిలో వచ్చిన మార్కుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారిగా క్లాసులు జరుగుతున్నాయని అడి



పాఠశాల వసతుల గురించి తెలుసుకుంటున్న కలెక్టర్



చెంచు మహిళ దగ్గర వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

గారు. మంచిగా చదివి ఉన్నతంగా రాణించాలని సూచించారు. పాఠశాలలో హాజరు శాతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులతో కలెక్టర్ మాట్లాడుతూ నాణ్యమైన రుచికరంగా మధ్యాహ్నం భోజనాన్ని విద్యార్థులకు అందజేయాలని, వారంలో మూడు గుడ్లను తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఆధార్ కార్డులేని చెంచులకు కొత్త ఆధార్ కార్డు అందించేందుకు గ్రామంలో ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని చెంచులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ కార్డులను పొందాలని సూచించారు. కొత్త రేషన్ కార్డులుప్రభుత్వం మంజూరుచేసిన వెంటనే అందజేస్తామని తెలిపారు. అర్హులైన లబ్దిదారులందరికి ఆసరా పెన్షన్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సూచించారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సంక్షేమ పథకాలను చెంచులకు అందజేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు. చెంచు సమస్యలపై పూర్తి అవగాహన ఉందనిఅవసరాలను తీర్చేందుకు నేడు సందర్శించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. పోడు భూములు ఎవరైతే సాగు చేసుకుంటున్నారో వారికి న్యాయం చేస్తానని, కొత్తగా అడవిలో చెట్లు నరికి సాగుచేసేందుకు వీలు లేదని స్పష్టం చేశారు. అడవులు మన సంపదని అడవులను రక్షించుకోవడం మన ప్రథమ కర్తవ్యం అని కలెక్టర్ తెలిపారు. చెంచు సమస్యలన్ని పరిష్కరిస్తామని మళ్లీ గ్రామాన్ని సందర్శిస్తానని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారికమలాకర్‌రెడ్డి, కొల్లాపూర్ ఆర్డీఓనాగరాజు, సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, కొల్లాపూర్ తహసి ల్దార్ శ్రీకాంత్, వివిధశాఖలఅధికారులుతదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అర్హులైన రైతులకు విరివిగా రుణాలు అందించాలి

- గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్, జడ్పి చైర్మన్ సరిత

**గద్వాల ప్రతినిధి జులై3 ప్రభాతవార్త:** అర్హులైన రైతులకు, ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు విరివిగా రుణాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో డిసిసి/డిఎల్ఆర్సి జిల్లా స్థాయి బ్యాంకర్ల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు పంట అనుబంధ రుణాలు, ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్యా, గృహ రుణాలతో పాటు ఇతర ప్రాధాన్యత రుణాలను అర్హులైన పేద ప్రజలకు మంజూరు చేయాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం 59 బ్యాంకులు ఉన్నాయని, కేటి దొడ్డిలో మరొక నూతన బ్రాంచి ఏర్పాటు కొరకు చర్యలు చేపట్టాలన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ లక్ష్యం170కోట్లు కాగా, 216 కోట్ల రుణాలు అందజేసి 127 శాతం లక్ష్యం సాధించి రాష్ట్రంలో నే జిల్లాను మొదటిస్థానంలో నిలిచినందుకు జిల్లా కలెక్టర్ బ్యాంకర్లకు, డిఆర్డిఓ అధికారులకు అభినందనలు తెలిపారు. ఇదే విధంగా గత వార్షిక సంవత్సరంలో పంటరుణాలు, ప్రాధాన్యతరంగాలు, విద్యారంగాలలో ఆశించినంతగా రుణాలు అందజేయలేకపోవడం జరిగిందన్నారు. అన్ని బ్యాంకుల ద్వారా గ్రామాలలో అర్హులను గుర్తించి విరివిగారుణాలు అందించాలన్నారు. ఇందుకుగాను గ్రామాలలో గ్రామ సభలు నిర్వహించి బ్యాంకు రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా 2024-25ఆర్థిక సంవత్సరానికి వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని జడ్పీచైర్ పర్సన్ సరితతో కలిసి కలెక్టర్ రూ.52 51.08 కోట్ల లక్ష్యంతో ఆవిష్కరించారు. వ్యవసాయ రంగానికి 4191.23 కోట్లు, మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు రూ.474 .47 కోట్లు ప్రాధాన్యతా రంగాలకు రూ.4821.77 కోట్లు ప్రాధా న్యేతర రంగాలకు 156.07 కోట్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలి పారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.4675.42 లక్ష్యం కేటాయించగా, 2703.46 రుణాలను అందజేసి 57.82 శాతం మాత్రమేలక్ష్యం సాధించడం జరిగిందని తెలిపారు. అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యలను సాధించేందుకు అన్ని రంగాలలో రుణాలు అందించే దిశగా కృషి చేయాలన్నారు. 2016-17 సంవత్సరం నుండి పెండింగుగా ఉన్న యూసీలను వెంటనే క్లియర్ చేసి యస్సి విద్యార్థులకు రుణాలు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌సరిత, డిఆర్డిఓ ఇంచార్జిఅడిషనల్ కలెక్టర్ నర్సింగరావు, ఎల్‌డిఎం అయ్యపురెడ్డి, నాబార్డు డీడీఎం మనోహర్ రెడ్డి, ఆర్బిఐఎల్డిఓ పృథ్వి ఫాల్గొని వివిధ శాఖల సంబంధిత అధికారులు, బ్యాంకు మేనేజర్లు తదితరులు ఉన్నారు.



# వార్డు సమస్యలపై అవగాహన ఉండాలి

- **మున్సిపాలిటీలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి**
- **మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 03 ప్రభాతవార్త:** ప్రతి వార్డులో ఉన్న ప్రతి సమస్యను చక్కదిద్దేందుకు వార్డు ఆఫీసర్లు కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ పురపాలక సంఘం కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో జరిగిన రివ్యూ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి వార్డు ఆఫీసర్ విధిగా తమ తమ వార్డులోని ప్రతి ఇంటిని సందర్శించాలని, ప్రతి ఇంటికి సంబంధించిన కనీస సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని ఆయన తెలిపారు. ప్రతి వార్డులో ఉన్న సమస్యకు వార్డు ఆఫీసర్ పూర్తిగా అవగాహన కలిగి ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యల్ని ఎప్పటికప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రజలకు ఉన్న సమస్యకు సంబంధించి తొలి ఫోన్‌కాల్ వార్డ ఆఫీసర్స్‌కే రావాలని, వార్డు ఆఫీసర్ల దృష్టికి వచ్చినసమస్యలు మున్సిపల్‌చైర్మన్‌కు కమిషనర్‌కు తెలియజేయాలని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ మున్సిపాలిటీని ప్రథమ స్థానంలో నిలపాలని ఆయన సూచించారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలో ఇప్పటికే 260 కోట్లతో సిసి రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ కోసం టెండర్లు పూర్తికాగా 600 కోట్లతో ప్రభుత్వానికి ప్రపోజ్‌సిద్ధం చేసి పంపించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రజలకు కలిగే ఇబ్బందులను అధికారుల దృష్టికి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

తీసుకొచ్చేందుకు మున్సిపాలిటీ కోసం 24/7 ఒక కాల్ సెంటర్ టోల్ ఫ్రీనంబర్ ఏర్పాటు చేయాలని ఆయన కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా సేవ చేయాలని, టౌన్‌ప్లాన్ విషయంలో చాలా కంప్లైంట్స్ వస్తున్నాయని వాటిమీద తగుజాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వార్డు ఆఫీసర్లకు సూచించారు. హరితహారం సందర్భంగా విద్యార్థుల చేత వారి తల్లి పేరున కనీసం ఒక మొక్కను నాటించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కనీసం ప్రతి ఒక్క వార్డులో వెయ్యి మొక్కలు నాటించాలని ఆయన సూచించారు. హరితహారం సందర్భంగా 1 లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా చేసుకుని ప్రణాళికలు సిద్ధం చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, వార్డు ఆఫీసర్లు, అధికారులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకై సమిష్టిగా కృషి చేయాలి

### మాదక ద్రవ్యాలపై పటిష్ట నిఘా : నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జులై 03 ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాల రవాణా, అమ్మకాలపై నిఘా పెంచాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి మాదకద్రవ్యాల నిరోధక సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎక్సైజ్, విద్యాశాఖ, డిస్టిక్ వెల్ఫేర్ అధికారి, డీఎంహెచ్ఓ, అగ్రికల్చరల్, పోలీస్, వివిధ శాఖల అధికారులతో మత్తుపదార్థాల నివారణ, రవాణాపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి ఉత్పత్తి, రవాణా వినియోగంపై కమిటీ సమావేశ అధికారులు పటిష్ట నిఘా పెట్టి నాగర్‌కర్నూల్ జిల్లాలో మాకద ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మత్తు పదార్థాలపై, వాటి వల్ల కలిగే అనార్థలపై అవగాహనను కల్పించాలని, ప్రతి ఆంటీ డ్రగ్ కమిటీల నందు పోలీసులు,



విద్యార్థులు, ఉపాధ్యాయులు, వారి తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఐదుగురికి తక్కువ కాకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్ అధికారులు గ్రామాల్లో అవగాహనసదస్సులు ఏర్పాటుచేసి రైతులను, విద్యార్థులను, ప్రజలను చైతన్యపర్చాలన్నారు. సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రోహిత్‌గోపిడి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుధాకర్ లాల్, జిల్లా ఎక్సైజ్ అధికారి, ఇతర, పోలీస్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమమే ధ్యేయం..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

పాలకులం కాదు సేవకులం అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. మేము పేద బడుగు బలహీన వర్గాల వారికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హన్వాడ మండల తహసిల్దార్ కిష్టానాయక్, హన్వాడ ఎంపిటిసి యాదయ్య, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మహేందర్, డిసిసి కార్యదర్శిటంకర కృష్ణయ్య, నాయకులు బి. సుధాకర్‌రెడ్డి, మారేపల్లి సురెందర్‌రెడ్డి, నవనీత, లింగంనాయక్ పాల్గొన్నారు.

## డిజిటల్ క్లాసుకు ఆర్థిక సహాయం అందజేత

**ఉప్పునుంతల, జులై 03 ప్రభాతవార్త :** మండలంలోని ఉప్పరిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ క్లాస్ కోసం అనంతమోహన్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆగ్రో ఇండస్ట్రీస్ వారిచే ఆర్థిక సాయం అందజేశారు. దీంతో మంగళవారం డిజిటల్ క్లాస్ రూమ్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించారు. వారితో పాటు జడ్పీటిసి అనంత ప్రతాప్‌రెడ్డి, తాజా మాజీ సర్పంచ్ అనంత ఇంద్రసేనారెడ్డి, మండల విద్యాధికారి రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు అంబయ్య, స్వప్న, మహేష్, కర్ణాకర్ పాల్గొన్నారు.

## సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

**వన మహోత్సవంలో అందరూ మొక్కలు నాటాలి : డీసీఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి**

**రాజాపూర్, జులై 03 ప్రభాతవార్త :** రాజాపూర్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిపి సుశీల రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో బుధ వారంసాదాసీదాగా మండల సాధారణసర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల పనితీరుపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ ఛైర్మన్‌పట్ల ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులుకృషి చేయాలనిమండలాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతిఒక్క మండల అధికారిపై ఉందన్నారు. వన మహోత్స వంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిస్తూ భావిత రాలకు కాలుష్యంలేని వాతావరణం అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరునిపై ఉందన్నారు.

**సాదాసీదాగా సర్వసభ్య సమావేశం:** సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసినందున అధికారులను అభివృద్ధిపై ప్రశ్నించే నాథుడు లేక సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. కొన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలు అందజేయలేదు. అంతకుముందు డిసిఎంఎస్ ఛైర్మన్‌పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి సుశీల రమేష్ నాయక్, వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ ఛైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎంపిపి సుశీల రమేష్‌నాయక్, వైస్ ఎంపిపి మహిపాల్‌రెడ్డి, తహసిల్దార్ విద్యాసాగర్‌రెడ్డి, ఎంపిడిఓ మశ్చేందర్, కో ఆప్షన్ అల్తాఫ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎంపిపి, ఎంపిటిసిలకు ఘన సన్మానం

**దేవరకద్ర, జులై 03 ప్రభాతవార్త:** ప్రజా క్షేత్రంలో ప్రజలకు సేవ చేసే భాగ్యం రావడం చాలా అదృష్టమని దేవరకద్ర ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్ అన్నారు. దేవరకద్ర ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిపి, ఎంపిటిసిల పదవికాలం ముగియడంతో వారిని మండల అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్ ప్రసంగించారు. ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడానికి కృషి చేయాలన్నారు. అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలన్నారు. గ్రామాభివృద్ధి విషయంలో అధికారులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. తాను పని చేసిన ఐదేళ్ల పదవీకాలం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఇది జీవిత కాలం గుర్తుండిపోతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఎంపిపి రమా శ్రీకాంత్ యాదవ్‌తో పాటు వైస్ ఎంపిపి రమాశ్రీకాంత్ యాదవ్, తుమ్మల సుజాతశేఖర్‌రెడ్డితో పాటుఎంపిటిసిలు, అధికారులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనివాసరావు, పశువైద్యాధికారి జిషాన్ అలీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శరత్‌చంద్ర, విద్యాశాఖఅధికారి బలరాంలతోపాటు ఆయాగ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆయాగ్రామాలకు చెందిన ఎంపిటిసిలు, నాయకులు పాల్గొన్నారు.

## ఇమ్యునైజేషన్ విషయంలో నిర్లక్ష్యం తగదు

- **ఓఆర్ఎస్ ద్రావణం తయారీపై అవగాహన పెంచాలి**
- **జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కె.రవికుమార్ నాయక్**

**బిజినపల్లి, జులై 03 ప్రభాతవార్త:** ఆరోగ్యశాఖ పుట్టిన బిడ్డ నుండి ఐదేళ్ల పిల్లలకు అందిస్తున్న ప్రత్యేక ప్రాణాంతక వ్యాధి నిరోధక టీకాలను ప్రతి బుధ, శని వారాలలో సార్వత్రిక టీకా కార్యక్రమం తప్పనిసరిగా అర్హులైన చిన్నారులందరికి టీకాలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె. రవికుమార్ నాయక్ సూచించారు. బుధవారం బిజినపల్లి మండల పరిధిలోని మంగనూరు ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహిస్తున్న సార్వత్రిక టీకా పంపిణీ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. సిబ్బంది, ఆశా కార్యకర్తలు ముందుగానే గుర్తించిన చిన్నారులకు వేస్తున్న టీకాల పంపణీ నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని చెప్పారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రభుత్వం సరఫరా చేసిన టీకాలను తప్పనిసరిగా మొదటి స్టేజీలోనే అందించాలని ఆయన సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది, ఆశాకార్యకర్తలు ఇంటింటా ఈనెలలో ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం తయారీపై తల్లులకు, బాలింతలకు ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కాలానుగుణంగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరు కలుషితమైన వాటినితాగితే వచ్చేవిరోచనాలు, జ్వరాలు, వాంతులపై తీసుకో వాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్‌ఎడ్యుకేటర్ నరసింహ, పర్యవేక్షకులు కేశవులు, ఆరోగ్యకార్యకర్తలు టి.యాదగిరి, పి.పద్మ, జ్యోతి, అంగన్‌వాడికార్యకర్త సుగుణ, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు, రోగులు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**రాజాపూర్, జులై 03 ప్రభాతవార్త:** రాజాపూర్ పోలీస్ స్టేషన్‌ను అకస్మాత్తుగా తనిఖీ చేశారు జిల్లా ఎస్పీ జానకి ధరావత్. బుధవారం సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ జానకి ధారావత్ అకస్మాత్తుగా పోలీస్ స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు ఎస్సై రవినాయక్ తెలిపారు.

## జులై 4న రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్

**ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు విద్యార్థి సంఘాల పిలుపు**

**మాగనూరు, జులై 03 ప్రభాతవార్త:** జాతీయ స్థాయిలో విద్యా రంగంలో ఎంబిబిఎస్ ఇతర వైద్య విద్య కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ యూజీ ఎంట్రన్స్‌లో అవకతవకలు జరిగాయని దేశవ్యాప్తంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నీట్ లీకేజీపై ఆందోళన నిర్వహిస్తున్న దేశ ప్రధాని మోడీ స్పందించకపోవడం సిగ్గుచేటని, అసమర్థ ఎన్డీఎను రద్దు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా, ప్రైవేట్ కార్పోరేట్ ఫీజులను నియంత్రణ చేయాలని, పాఠశాలల మూసివేత తదితర డిమాండ్లపై రాష్ట్రవ్యాప్తంగా జులై 4న విద్యా సంస్థల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బంద్‌కు స్వచ్ఛందంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యా సంస్థల యాజమాన్యాలు సహకరించాలని, బందులో విద్యార్థినీ, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొనిజయప్రదం చేయాలనివిజ్ఞప్తి చేశారు. సమావేశంలో మాగనూరు మండల నాయకులు నరసింహ, సాకేత్ ప్రభు, మహేష్, అనిల్, ఆకాష్ పాల్గొన్నారు.

## పొంచి ఉన్న ప్రమాదం..

### - విద్యుత్ శాఖ అధికారులు స్పందించరా..?

**జడ్చర్ల, జులై 3, ప్రభాతవార్త:** జడ్చర్లలోని గౌరీ శంకర్ కాలనీ ఫేజ్-1 వద్ద కాలనీ బోర్డు వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని బిక్కు బిక్కుమంటూ స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అయితే అదే స్తంభానికి విద్యుత్ వైర్లతో పాటు, చాలా వరకు టెలిఫోన్ వైర్లుఇతర వైర్ కనెక్షన్లుఉండడంతో స్తంభం కృంగిపోవడానికి సిద్ధంగా ఉన్నది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి స్తంభానికి మరమ్మతు చేయడమా, కొత్త స్తంభం బిగిండమా చేయాలని స్థానికులు కోరుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ఆస్తినష్టం ప్రాణనష్టం కలిగే ప్రమాదం ఉందని స్థానిక విద్యుత్ అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



విరిగిన విద్యుత్ స్తంభం